నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 160 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
26-04-2026 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4

# హెల్మెట్




# భారం కాదు బాధ్యత





- "అభయం" పేరిట శ్రీకాకుళంలో భారీ అవగాహన ర్యాలీ
- హెల్మెట్ ధరించే గ్రామాలకు ప్రత్యేక ప్రోత్సాహం
- జిల్లాలో తొలిసారిగా 'హెల్మెట్ బ్యాంక్' ప్రారంభం
- ప్రజల ప్రాణరక్షణే లక్ష్యం: కలెక్టర్, ఎస్పీ

**నవతరం -శ్రీకాకుళం**

హెల్మెట్ ధరించడం భారం కాదు, ప్రతి ద్విచక్ర వాహనదారుడి బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించడానికి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి సూచించారు.

శ్రీకాకుళం పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం "అభయం" పేరుతో హెల్మెట్ ధారణపై ప్రత్యేక అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. స్వయంగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు.

రామలక్ష్మణ కూడలి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సూర్యమహల్ జంక్షన్ మీదుగా అరసవెల్లి జంక్షన్ వరకు కొనసాగింది. అనంతరం "అభయం -హెల్మెట్ బ్యాంక్"ను ప్రారంభించి పోస్టర్, ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో అధిక శాతం ద్విచక్ర వాహనదారులేనని తెలిపారు. లక్షల రూపాయల విలువైన వాహనాలు కొనుగోలు చేసే వారు తక్కువ ధరలో లభించే హెల్మెట్ కొనడంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. హెల్మెట్ ధరించడం అలవాటుగా మార్చుకొని రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని పిలుపునిచ్చారు.

హెల్మెట్ వినియోగాన్ని గ్రామస్థాయికి విస్తరించి, ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించే గ్రామాలను "అభయం గ్రామాలు"గా గుర్తించి ప్రత్యేక సహాయం అందిస్తామని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో 62 శాతం మంది హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులేనని వెల్లడించారు. తలకు గాయాలు తీవ్ర పరిణామాలకు దారి తీస్తాయని, హెల్మెట్ ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని అన్నారు.

జిల్లాలో సుమారు రెండు లక్షల వాహనాలు ఉన్నప్పటికీ కేవలం ఐదు శాతం మంది మాత్రమే హెల్మెట్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించేలా చేయడానికి "హెల్మెట్ బ్యాంక్" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి తాత్కాలికంగా హెల్మెట్ అందజేసి, వారి వివరాలు నమోదు చేసి, వారు స్వయంగా హెల్మెట్ కొనుగోలు చేసిన తర్వాత తిరిగి సమర్పించే విధానం అమలు చేస్తామని వివరించారు. తొలి దశలో శ్రీకాకుళం సబ్‌డివిజన్ పరిధిలోని మిల్లు జంక్షన్, డే, నైట్ ప్రాంతం, బలగ ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

భవిష్యత్తులో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి పెట్రోల్ బంకుల్లో ఇంధనం ఇవ్వకుండా చర్యలు తీసుకునే దిశగా కూడా ప్రణాళికలు ఉన్నాయని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాలు, జాతీయ రహదారులపై ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణనష్టం నివారించవచ్చని స్పష్టం చేశారు.

జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి, కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.

అనంతరం "అభయం" రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి, హెల్మెట్లు దానం చేసిన దాతలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఏ. విజయసారథి, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, రవాణా అధికారి గంగాధర్, డాక్టర్ సింధూర, పోలీసు అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో బలవంతపు భూసేకరణ ఎందుకు?

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సమాధానం చెప్పాలి: వామపక్షాలు
- హరిపురంలో వామపక్ష నేతల అరెస్టు
- నిర్బంధాలతో ఉద్యమాలు ఆగవని హెచ్చరిక

2లో



## ప్రమాదాల నివారణకు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు



- శ్రీకాకుళం మెడికల్ షాపుల్లో వినూత్న ప్రారంభం
- 15 కేంద్రాల్లో తొలి విడత ఏర్పాటు
- ప్రజారోగ్య రక్షణే లక్ష్యం

2లో



## న్యాయం ఇంటింటికి



**నవతరం -శ్రీకాకుళం**

- సంచార వాహనం ప్రారంభం
- బాల్య వివాహాలపై అవగాహన
- 15100కు ఫిర్యాదు చేయాలి

జిల్లా ప్రజలకు న్యాయ సహాయం చేరువ చేయాలనే లక్ష్యంతో సుప్రీంకోర్టు అందించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంచార వాహనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలు, బలహీన వర్గాలు సులభంగా న్యాయ సేవలు పొందేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందని తెలిపారు.

అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు ఆధ్వర్యంలో సింగుపురంలో బాల్య వివాహాలు, -మిగతా 2లో

ఎడిటోరియల్

# ట్రంప్ దిగొస్తున్నాడా!

పశ్చిమాసియాలో తనకు కొరకరాని కొయ్యగా ఉన్న ఇరాన్‌ను మింగివేయాలని చూసిన అమెరికాకు ఎదురు దెబ్బతగిలింది. నాలుగైదు వారాల్లో ఇరాన్ పని అయిపోతుందని, దాడులు నిలిచిపోతాయని తొలిరోజుల్లో చెప్పిన ట్రంప్ యాభై ఐదు రోజుల తరువాత మాట మార్చాడు. కాల్పుల విరమణ పొడిగింపునకు ఎలాంటి కాలవ్యవధి లేదని తాజాగా చెప్పాడు. మధ్యంతర ఎన్నికల కోసం పోరు ముగించాలని తాను అనుకుంటున్నట్లు చెబుతున్నారని, తనమీద ఎలాంటి ఒత్తిడి లేదని చెప్పుకున్నాడు. తాజా దాడులతో అమెరికా ఇప్పటికే అరవై బిలియన్ డాలర్ల మేరకు నష్టపోయిందని, ఇంకా అంతకంటే ఎక్కువగానే పౌరులపై ఇంథన భారం పడిందని చెబుతున్నారు. బర్రె చచ్చిన తరువాత పాడి గురించి బయటపడుతుందన్న సామెత మాదిరే పోరు ముగిసిన తరువాత జరిగిన పూర్తి నష్టాలు వెల్లడౌతాయి. ఇరాన్‌పై ఉత్తి పుణ్యానికి దాడులను ప్రారంభించి ఇప్పుడు యావత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను డోనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని అమెరికా చెరబట్టింది. ఈ దుర్మార్గపు ఉన్మాదంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియటం లేదు. ఇప్పటికే ఒక ముఖ్య సైనికాధికా రిని తొలగించిన ట్రంప్ యంత్రాంగం ఇప్పుడు నౌకాదళ మంత్రిని బర్తరఫ్ చేసింది. తమ వైఖరితో విబేధించిన వారిని, భజన చేయని ఇంకా ఎంత మందిని ఇంటి బాటపట్టిస్తారో తెలియదు. ఇలాంటి మతిమాలిన చర్యలు అమెరికా మిలిటరీ, పౌర యంత్రాంగంలో విబేధాలను పెంచేవే తప్ప మరొకటి కాదు.

పశ్చిమాసియా సంక్షోభం రోజురోజుకూ ప్రపంచంలోని అనేక దేశాల ఇబ్బందులను పెంచుతోంది. ఇరాన్ రోజుకు యాభై కోట్ల డాలర్లు నష్టపోతున్నదని ట్రంప్ సంబరపడవచ్చు,అతగాడి మిత్రులైన ఐరోపా దేశాలకు అంతకంటే ఎక్కువగా అరవై కోట్ల డాలర్లమేర చమురు వదులుతున్నది. మనకూ చాలా నష్టం జరుగుతున్నప్పటికీ ప్రధానితో సహా అనేక దేశాల నేతలు నోటికి తాళాలు వేసుకోవటాన్ని జనం గమనిస్తున్నారు. హార్ముజ్ జలసంధిలో తాము గనుక దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే ఇరాన్‌తో ఎన్నటికీ ఒప్పందం కుదిరే అవకాశం లేదని, లేకపోతే ఇరాన్ మొత్తాన్ని పేల్చివేయాల్సి ఉంటుందని డోనాల్డ్ ట్రంప్ చెప్పాడు. తమ రేవులను చెరబట్టిన అమెరికా అక్కడినుంచి తప్పు కుంటే తప్ప చర్చలకు వచ్చేది లేదని ఇరాన్ పదేపదే చెబుతోంది. తమను ఇబ్బంది పెట్టే అమెరికా స్థావరాలకు స్థానమిచ్చిన దేశాలను వదిలేదిలేదని, అవసర మైతే సముద్ర గర్భంలో ఉన్న సమాచార వైర్లను కూడా ధ్వంసం చేస్తామని కూడా ఇరాన్ హెచ్చరించింది. విధిలేని స్థితిలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరవధికంగా పొడిగిస్తు న్నట్లు ట్రంప్ చెప్పాల్సి వచ్చింది.ట్రంప్ మాటలకు చేతలకు పొంతనలేదని ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్నాడని, దీన్ని యావత్ ప్రపంచం చూస్తున్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజాషికియన్ చేసిన వ్యాఖ్యలు నూటికి రెండువందల శాతం వాస్తవం. జలసంధిలో నౌకల నుంచి కప్పం వసూలు చేసినట్లు తొలిసారిగా ఇరాన్ ప్రకటించింది. వాటిలో తమవిగానీ, ఇజ్రాయిల్‌వీ లేవని అందువలన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లం ఘించినట్లు తాము భావించటం లేదని అమెరికా ప్రకటించటం గమనిం చాల్సిన విషయం. దీన్నిబట్టి ఇప్పుడు బంతి అమెరికా కోర్టులోనే ఉంది, అది అంతిమంగా దిగిరాక తప్పదు, ఎలా అన్నదే ఆసక్తి కలిగించే అంశం.

ఒకవైపు అమెరికాలో చర్చలు అంటూనే లెబనాన్ అక్కడ ఉన్న హిజబుల్లా సాయుధుల మీద ఇజ్రాయిల్ ఏదో ఒక సాకుతో దాడులు కొనసాగిస్తున్నది. దాని చర్యలు విరమించకపోతే హార్ముజ్ జలసంధిని తెరవటం జరగదని మరోసారి హెచ్చరించింది. తమ ఆంక్షలను ఉల్లంఘిం చిన నౌకలమీద దాడులు చేస్తూ ఎలా కాపాడుకుంటారో చూస్తామన్నట్లుగా అమెరికాకు సవాలు విసురుతున్నది. టెహరాన్‌కు మూడు నుంచి ఐదు రోజుల గడువు ఇస్తున్నానని ఈలోగా ఒప్పందానికి రాకపోతే పొడిగించిన కాల్పుల విరమణ నిర్ణయాన్ని రద్దుచేస్తానని ట్రంప్ బెదిరించటంలో పసలేదు. ఈ పూర్వరంగంలోనే పరాభవ ఉక్రోషాన్ని ఎలా వెళ్లగక్కాలో దిక్కుతోచక చైనా, భారత్ నరకకూపాలని నోరు పారవేసుకున్నాడు. ఇరాన్‌పై దాడిని చైనా పూర్తిగా ఖండించగా భారత్ మౌనంగా ఉన్నప్పటికీ ట్రంప్ ఆశించినట్లుగా మద్దతుదారుగా ఉండేం దుకు సిద్ధంగాక పోవటంతో మనదేశాన్ని వదల్లేదు. జన్మతో అమెరికాలో పౌరసత్వహక్కుకు వ్యతిరేకంగా ఉన్న ఒక లేఖను సమర్ధిస్తూ అమెరికాలో ఒక బిడ్డపుడితే పౌరసత్వం వస్తుంది, తరువాత ఆ బిడ్డపేరుతో భారత్, చైనాల వంటి నరక కూపాల నుంచి మొత్తం కుటుంబాలు వచ్చి తిష్టవేస్తాయంటూ వాగాడు. నిజానికి ఈ రెండు దేశాలూ నాలుగువేల సంవత్స రాలుగా పురాతన నాగరికతలను కొనసాగిస్తున్నవని, నిన్నగాక మొన్న 250 ఏండ్ల నాడు ఉనికిలోకి వచ్చిన అమెరికానే నిజ మైన నరకమని ఇరాన్ వ్యాఖ్యానించింది. ట్రంప్ వ్యాఖ్యలపై మనవిదేశాంగ శాఖ స్పందన దున్నపోతుమీద వానలా ఉంది. 'అలాంటి వార్తలను చూశాము, ఇంతకంటే చెప్పేదేమీ లేదనటం' గర్హనీయం. అమెరికాకు బానిసల మాదిరి ఇంతగా లొంగిపోవాలా!

# కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో బలవంతపు భూసేకరణ ఎందుకు?

**నవతరం -మందస**

కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో ఉద్దానం ప్రాంతంలో బలవంతపు భూసేకరణ ఎందుకు చేపడుతున్నారో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా ఉపాధ్యక్షులు వంకల మాధవరావు డిమాండ్ చేశారు.

ప్రతిపాదిత కార్గో ఎయిర్‌పోర్ట్ రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని, పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలని కోరుతూ వామపక్షాలు 25, 26 తేదీల్లో ప్రభావిత గ్రామాల్లో పర్యటన చేపట్టాయి. ఈ సందర్భంగా హరిపురంలో కామ్రేడ్ మార్పు పద్మనాభం విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం పర్యటనకు వెళ్తున్న నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో డి. గోవిందరావు, చాపర వెంకటరమణ, వంకల మాధవరావుతో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభావిత గ్రామాల్లో పర్యటించడానికి ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో ఉద్దానాన్ని ఉరితీయాలని చూస్తున్నారని ఆరోపించారు. తరతరాలుగా సాగుచేస్తున్న భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం అన్యాయమన్నారు.

సుమారు ఐదు లక్షల చెట్లు నరికి వేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, తుఫాన్లు, సునామీల సమయంలో తీరప్రాంతానికి రక్షణగా ఉన్న చెట్లను తొలగించడం ప్రమాదకరమని హెచ్చరించారు.

జిల్లాలో నేరడి బ్యారేజ్‌తో పాటు పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు తీసుకురావడంలో కేంద్ర మంత్రి విఫలమయ్యారని విమర్శించారు. ఆ ప్రాజెక్టులు పూర్తయితే వ్యవసాయం అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వలసలు తగ్గుతాయని తెలిపారు.

బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని వామపక్ష నేతలు హెచ్చరించారు.

# న్యాయం ఇంటింటికి

**మొదటిపేజీ తరువాయి**

చిన్న వయసులో గర్భధారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యానికి తీవ్ర హానికరమని, పిల్లలను చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఇలాంటి సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 15100 లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జిలు, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు

**నవతరం -శ్రీకాకుళం**

రోజువారీ ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న ఔషధాలయాలు (మెడికల్ షాపులు)లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకులు ఎం. చంద్రరావు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఇదే తొలి వినూత్న కార్యక్రమమని పేర్కొన్నారు.

శ్రీకాకుళం టౌన్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్స్ అసోసియేషన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదాల సమయంలో తక్షణ సహాయం అందించేందుకు బాక్సుల్లో అవసరమైన మందులు, బ్యాండేజీలు, ఇతర ప్రాథమిక చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రమాద బాధితులకు సమయానికి ప్రథమ చికిత్స అందించి ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మొదటి విడతలో శ్రీకాకుళం పట్టణంలోని 15 ప్రధాన కేంద్రాల్లో ఈ బాక్సులు ఏర్పాటు చేసి ఒకేసారి ప్రారంభించినట్లు వెల్లడించారు.

అలాగే ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముఖ్య సూచనలతో స్టిక్కర్లు, గోడపత్రికలు కూడా అమర్చినట్లు తెలిపారు.

ప్రజలు తమ సూచనలు, అభిప్రాయాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి వచ్చిన స్పందన ఆధారంగా భవిష్యత్తులో శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లోని మరిన్ని ప్రధాన కూడళ్లలో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మందుల వర్తకుల రాష్ట్ర కార్యదర్శి కరుణ్ కుమార్ గుప్తా, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, పట్టణ సంఘ ప్రతినిధులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, రిటైల్ వ్యాపారులు పాల్గొన్నారు.

# మలేరియా నివారణ మనందరి బాధ్యత

**నవతరం -శ్రీకాకుళం**



జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారిణి శ్రీమతి డా।। కె. అనిత గారి అధ్యక్షతన అసిస్టెంట్ జిల్లా మలేరియా అధికారి ఎస్.శ్రీనివాసరావు గారి ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నిర్మూలనా దినోత్సవం నిర్వహించడమైనది. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారిణి శ్రీమతి డా।। కె. అనితగారు జెండా ఊపి లాంఛనంగా ఈ కార్యక్రమము ప్రారంభించారు. మలేరియా అంతం మనతోనే మరలా వనరులు చేకూర్చు! మరలా కొత్తగా ఆలోచించు! మరలా ఉత్తేజం పొందు... మలేరియా నివారణ మనందరి బాధ్యత. ఇప్పుడు మనం సాధించగలం - ఇప్పుడు మనం తప్పక సాధించాలి అను నినాదంతో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ కార్యాలయం నుండి స్థానిక ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా వ్యాధిపట్ల తీసుకోవలసిన చర్యలు పట్ల గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టుట జరుగుచున్నదనియు, అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలోను, ఆరోగ్య ఉపకేంద్రాలలోను మలేరియాకు కిట్లు, మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, మునిసిపాలిటీ అథారిటీ సహకారంతో దోమలు లార్వ నియంత్రణా చర్యలు చేపట్టుట జరుగుచున్నదని తెలియజేశారు. ప్రజలందరు, ఇళ్లలోను మరియు ఇంటి బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని, పడుకొనేటప్పుడు దోమతెరలు వాడాలని పిల్లలకు చేతులు, కాళ్లకు నిండుగా ఉండే దుస్తులు వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డి.ఐ.ఓ డా।।రామ్ దాన్, డిప్యూటీ డి.ఎమ్. హెచ్.ఓ డా।। మేరీ కేథరిన్, ఆర్.బి.ఎస్.కె. ప్రొగ్రామ్ అధికారి డా।। శివరంజిని, ఎన్.వి.బి.డి.సి.పి. కన్సల్టెంట్ ఎల్. శ్రీకాంత్, డిప్యూటీ హెచ్.ఇ.ఓ పి.మోహిని రత్నకుమారి, సోషల్ వర్కర్ మంతెన వెంకటస్వామి మరియు మలేరియా కార్యాలయ సిబ్బంది దుర్గా ప్రసాద్, మురళి, శాంతారావు, శ్రీధర్, అర్బన్ యు.పి. హెచ్.సిల ఎ.ఎన్.ఎం లు మరియు ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు.. బాలికల భవిష్యత్తుకు శాపాలు






**నవతరం -శ్రీకాకుళం:**

ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల వారు తీవ్రమైన అనారోగ్య సమస్యలను ఎదుర్కోవడమే కాకుండా, వారి భవిష్యత్తు అంధకారమవుతుందని, బాల్య వివాహాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు పిలుపునిచ్చారు. శనివారం సింగుపురంలో బాల్య వివాహాలు, చిన్న వయసులో గర్భధారణ వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

ఆర్థికంగా వెనుకబడిన కొన్ని సామాజిక వర్గాల్లో ఇప్పటికీ ఇలాంటి వివాహాలు జరుగుతుండటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించాలని, చిన్న వయసులో పెళ్లిళ్లు చేసి వారి ఆరోగ్యాన్ని పాడు చేయవద్దని హరిబాబు సూచించారు. బాల్య వివాహాల వల్ల గర్భధారణ సమయంలో ప్రాణాపాయ పరిస్థితులు ఎదురవుతాయని, పుట్టబోయే పిల్లలు కూడా అనారోగ్యంతో జన్మించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బాల్య వివాహాల సమాచారం తెలిస్తే వెంటనే 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని కోరారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పిల్లల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాజాం మేజిస్ట్రేట్ కె. నైమిష, డీసీపీఓ కె. రమణ, కేశవరావుపేట ఎంపీటీసీ పి. భాస్కర్ రావు, చీఫ్ ఎల్ఏడీసీ, ప్యానెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతా మార్గం
# అద్భుతమైన ప్రక్రియ నగర సంకీర్తనం

ఉదయం పూట పవిత్రమైన కీర్తనలు వినడం వల్ల వాతావరణంలోని ప్రతికూల శక్తులు తొలగిపోతాయి.సానుకూల శక్తి పెరుగుతుంది. వేకువ జామున నిశ్శబ్ద వాతావరణంలో భగవంతుని నామస్మరణ చేస్తూ,భజనలు, కీర్తనలు పాడుతూ గ్రామాలు, కాలనీల వీధుల్లో తిరగడం వల్ల ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుంది. ఇది కేవలం వ్యక్తిగత భక్తి కోసం కాదు, సమాజంలోని అందరూ సంతోషాలతో ఉండాలని,ఊరంతా క్షేమంగా ఉండాలని కోరుతూ చేసే సామూహిక ప్రార్థన.కుల,మత, వర్గ విభేదాలు లేకుండా అందరూ కలిసి డోలు, తబలా,చిడతలు, మృదంగం వంటి వాయిద్యాలతో పాల్గొంటారు.ఇది సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే నగర సంకీర్తన అనేది సమాజ క్షేమాన్ని మానసిక ప్రశాంతతను భక్తి భావాన్ని పెంపొందించే ఒక అద్భుతమైన ప్రక్రియ మార్గం. ఈ నగర సంకీర్తన కార్యక్రమంలో ముందు నడిచే వ్యక్తి గట్టిగా భక్తి గీతాలను పాడుతూ ఉంటే మిగిలినవారు అనుకరిస్తూ ఉంటారు వారానికి ఒకసారి ఉదయాన్నే భక్తి పాటలు పాడుకుంటూ నగర సంకీర్తన చేయడం వల్ల భక్తికి భక్తి ఆరోగ్యానికి ఆరోగ్యం లభిస్తాయని చాలామంది గృహిణులు కూడా అందులో పాల్గొంటారు. నిద్రలో ఉండి సంకీర్తన కార్యక్రమములో పాల్గొనని వారికి కూడా సంకీర్తన గీతాల శ్రవణం వల్ల పుణ్యం దక్కుతుంది.

సాధారణంగా చెప్పాలంటే 'కీర్తన 'కొన్నిసార్లు 'సంకీర్తన' అని పిలవబడుతుంది ఇది ఒక రకమైన సామూహిక జపం లేదా సంగీత సంభాషణ మతపరమైన ప్రదర్శన కళ యొక్క ఒక శైలిగా,ఇది భారతీయ భక్తి ఉద్యమాలలో భక్తియోగంగా అభివృద్ధి చెందింది.

నగర సంకీర్తన అనేది భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో బ్రహ్మ ముహూర్తములో నిర్వహించే ఒక పవిత్రమైన, అద్భుతమైన, ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమం.

కీర్తన తెలుగు భాషలో ఒక విధమైన సాహిత్య ప్రక్రియ కర్ణాటక సంగీతంలో ఎందరో వాగ్గేయకారులు కొన్ని వేల కీర్తనలు రచించారు, వారిలో అన్నమయ్య,రామదాసు, త్యాగరాజు, క్షేత్రయ్య, మొదలైన వారు ముఖ్యులు అలాగే కీర్తనను లయబద్ధంగా ఆలపిస్తూ పాడడాన్ని సంకీర్తన అంటారు. నగర సంకీర్తన పితామహుడు చైతన్య మహాప్రభు. భగవంతుని పవిత్ర నామాలను సామూహికంగా జపించే సంకీర్తన ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఆయన నాదియాలో నివసిస్తున్నప్పుడు ఆయన గ్రామ గ్రామం తిరుగుతూ హరే కృష్ణ..హరే కృష్ణ.. కృష్ణ..హరే హరే..హరే.. రామ.. హరే రామ.. రామ.. హరే..హరే అని జపించేవారు.

హిందూమతంలో బెంగాలీ సాధు చైతన్య మహాప్రభు కీర్తన మరియు నగర కీర్తన ద్వారా భక్తి లేదా వ్యక్తిగత దేవుని పట్ల భక్తి భావాలను ప్రచారం చేశారు మరియు వైష్ణవ సంప్రదాయంలో ఈ ఆచారాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది. చైతన్యుని సామూహిక గానం జానపద బాణీలకు అనుగుణంగా ఉండేది.

కొన్ని ఏళ్ల క్రిందట నరసరావుపేటలో నగర సంకీర్తన బ్రహ్మ ముహుర్త కాలంలో భగవంతుని కీర్తిస్తూ సంకీర్తన పారాయణం చేస్తూ గ్రామాలలో భక్తి పరాయణులు నిర్వహించే వారు. సర్వేజన సుఖినోభవంతు అనే ఆర్యోక్తికి అనుగుణంగా సర్వమానవ శ్రేయస్సును కోరుతూ నిర్వహించే నగరసంకీర్తన నేడు కనుమరుగై పోయింది. నేడు వాహనాల రణగొణధ్వనులు తప్ప గ్రామగ్రామాన ప్రాతః కాలంలో లయబద్ధంగా వినబడే కీర్తనలు ఇప్పుడు వినపడకుండా పోయాయి. నేటి యువతకు నగర సంకీర్తన అంటేనే తెలియని పరిస్థితి నెలకొంది. అయితే నరసరావుపేటలో గత 86 ఏళ్లుగా క్రమం తప్పకుండా సాగుతున్న నగర సంకీర్తన ఇక్కడి అధ్యాత్మికతకు అద్దం పడుతుంది. శ్రీపట్టాభిరామస్వామి ఆలయం భక్తుల ఆధ్వర్యంలో 1933లో ప్రారంభమైన నగర సంకీర్తన భారీ తుఫాన్లో సైతం కొనసాగడం విశేషం. ప్రతి రోజు ఉదయం 4.30 గంటలకు ప్రారంభమయ్యే నగర సంకీర్తన పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగి 6 గంటల సమయంలో తిరిగి ఆలయానికి చేరుకునేది. ఈ నగర సంకీర్తన కార్యక్రమం 100 సంవత్సరాలు నిర్వహించాలని ప్రమాణం చేశారు. ఇప్పుడు ఈ నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నారో లేదు తెలియదు. వారి ఆశయం నెరవేరితే అభినందనలే.

(26-04-2026 రోజుల హిందూ సమ్మేళనం( నగర సంకీర్తన ) కార్యక్రమం హయత్ నగర్లో జరుగుతున్న సందర్భముగా హిందూ బంధువులకు శుభాకాంక్షలు)



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

## అభిషిక్తుడు...ఆనాడు..!
# అంబేద్కర్....ఈనాడు..!




క్రీస్తు...ఆనాడు
శిలువ మ్రానుపై
క్షమా త్యాగమనే
తోటలో ప్రేమను విత్తి
రక్తబిందువులు
చిందించి బోధించిన
మాట...

"ద్వేషం ముళ్లను
విరిచేయండి
"ప్రేమ పూల పరిమళాలను
"ప్రపంచమంతా
వెదజల్లండి...

అపార కృపా సాగరుడు
అల్లా...ఆనాడు ఆదేశించిన
ఆజ్ఞ

"నీ చేతిలోని అన్నం
"ఆకలితో అల్లాడే పొట్టలోకి
పోవాలి...
"దానం... దివ్యమైన ప్రార్థన
కావాలి..."

అంబేద్కర్...
ఆనాడు
అగ్నిజ్వాలగా
గర్జించిన సత్యం..

"కులపు గోడలపై
"సమాజం నిలబడదు...
"మేకల్ని బలి చేస్తుంది
"ఈలోకం పులుల్ని కాదు

అందుకే...
"కులవిష వృక్షాన్ని
"కూకటివేళ్లతో సహా
"పెకలించి వేయాలి
"కూల్చి...కాల్చి వేయాలి
"సమానత్వాన్ని నాటాలి..."

బుద్ధుడు...ఆనాడు
శాంతి సరస్సై
ప్రవహించిన వాక్యం...

"అహింసే అస్త్రం...
"సహనమే ఔషధం...
"ప్రేమే పరమ ధర్మం...
"సమానత్వం, సౌభ్రాతృత్వం
"స్వేచ్ఛా
స్వాతంత్రాలే
"నవలోకానికి
పునాదులు..."

ఈనాడు...?
మన మనసుల్లో
మిగిలింది
మాటల ప్రతిధ్వని
మాత్రమేనా...?
లేదా...మార్పు
విత్తనాలు
మొలకెత్తుతు
న్నాయా...?

ఇప్పటికైనా...
కులపు
కారుచీకట్లను కరిగిద్దాం...!
మనుష్యత్వపు జ్యోతిని
వెలిగిద్దాం...!
మనమూ మనుష్యులమేనని
నిరూపిద్దాం..!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# టీవీ అవకాశాలు వదిలేయడంతోనే ఆర్థికంగా వెనకబాటు?!

టీవీ అవకాశాలు వదిలేయడంతోనే ఆర్థికంగా వెనకబాటు?! ప్రస్తుతం సౌత్ నుంచి నార్త్ వరకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వెలిగిపోతున్న మృణాల్ ఠాకూర్ తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టెలివిజన్ రంగంలో ఉండగానే తనకు భారీ పారితోషికాలు ఆఫర్ చేశారని.. ఒకవేళ కేవలం డబ్బుకే ప్రాధాన్యత ఇచ్చి ఉంటే తాను ఈ పాటికే మిలియనీర్ అయి ఉండేదాన్నని పేర్కొన్నారు. అయితే పెద్ద మొత్తంలో డబ్బు తనను ఊరించినా కేవలం సంపాదన కోసమే పని చేస్తే తనలోని సృజనాత్మకత, వ్యక్తిత్వం దెబ్బతింటుందని భావించి ఆ అవకాశాలను వదులుకున్నట్లు మృణాల్ స్పష్టం చేశారు. మృణాల్ ఠాకూర్ తన నటనా ప్రయాణాన్ని కాలేజీ రోజుల్లోనే టెలివిజన్ రంగంలో ప్రారంభించారు. 2012లో -ముజ్సే కుచ్ కెహతీ...యే ఖామోషియాన్- సీరియల్‌తో మెప్పించిన ఈ భామ ఆ తర్వాత -కుంకుమ్ భాగ్య- సీరియల్‌తో ఇంటింటికీ చేరువయ్యారు. బుల్బుల్ పాత్రలో తన నటనకు ఐటీఏఅవార్డు కూడా లభించింది. టెలివిజన్ రంగంలో తిరుగులేని గుర్తింపు -ఆదాయం వస్తున్న సమయంలోనే వెండితెరపై తన ముద్ర వేయాలనే బలమైన కోరికతో టీవీ రంగానికి స్వస్తి పలికారు. టీవీ ఇండస్ట్రీని వదిలిపెట్టడం అనేది ఒక సాహసోపేతమైన నిర్ణయమే అయినా కానీ.. మృణాల్ కలలు వెండితెరపై ఫలించాయని చెప్పవచ్చు. మరాఠీ చిత్రాల ద్వారా సినిమా రంగంలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ 2018లో వచ్చిన -లవ్ సోనియా-తో బాలీవుడ్ దృష్టిని ఆకర్షించారు. ఆ తర్వాత హృతిక్ రోషన్ సరసన -సూపర్ 30- , జాన్ అబ్రహంతో -బాట్లా హౌస్- వంటి చిత్రాల్లో నటించి వరుస విజయాలను అందుకున్నారు. కేవలం డబ్బు వెనుక పరుగెత్తకుండా తనలోని నటిని సంతృప్తి పరిచే పాత్రల కోసం వేచి చూడటం వల్లే ఈ స్థాయిని చేరుకోగలిగారు. ముఖ్యంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మృణాల్ ఠాకూర్ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. -సీతా రామం- చిత్రంలో సీతామహాలక్ష్మిగా ఆమె పండించిన భావోద్వేగాలు తెలుగు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ చిత్రానికి ఫిలింఫేర్ ఉత్తమ నటి అవార్డును అందుకోవడమే కాకుండా ఆ తర్వాత -హాయ్ నాన్న-, -ఫ్యామిలీ స్టార్- వంటి చిత్రాలతో టాలీవుడ్ గోల్డెన్ లెగ్‌గా మారిపోయారు. పెద్ద తెరపై మృణాల్ పోషిస్తున్న వైవిధ్యమైన పాత్రలు తను తీసుకున్న నిర్ణయం సరైనదేనని నిరూపించాయి.

మృణాల్ ఠాకూర్ ప్రయాణం నేటి తరం నటీనటులకు ఒక స్ఫూర్తిదాయకం. తక్షణ ఆర్థిక ప్రయోజనాల కంటే సృజనాత్మక సంతృప్తికే పెద్దపీట వేయడం వల్ల కలిగే ఫలితాలు ఎలా ఉంటాయో ఈ భామ కెరీర్ నిరూపిస్తోంది. టెలివిజన్ మిలియనీర్ అయ్యే అవకాశాన్ని కాదనుకుని.. వెండితెరపై స్టార్ హీరోయిన్‌గా ఎదగడం ద్వారా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ప్రస్తుతం అడివి శేష్‌తో -డెకాయిట్- వంటి క్రేజీ ప్రాజెక్టులతో ఆమె తన విజయ యాత్రను కొనసాగిస్తున్నారు.





# కెరీర్ లో మొదటి హార్ట్ బ్రేక్ అదే

వ్యక్తిగత జీవితంలో తన బ్రేకప్ విషయాన్ని ఇప్పటికే బయటపెట్టాడు అడివి శేష్. ఇప్పుడు తన కెరీర్ లో తొలి హార్ట్ బ్రేక్ ఘటనను బయటపెట్టాడు. దర్శకుడు కృష్ణవంశీ వల్ల చాలా బాధపడ్డానని వెల్లడించాడు. కృష్ణవంశీ దర్శకత్వంలో చందమామ సినిమా వచ్చింది. అందులో ముందుగా హీరోగా అడివి శేష్ నే అనుకున్నారట. అనుకోవడం కాదు, దాదాపు ఫిక్స్ కూడా చేసేశారు. అయితే ఆఖరి నిమిషంలో అతడ్ని ప్రాజెక్టు నుంచి తప్పించారు. ఆ స్థానంలో నవదీప్ ను తీసుకున్నారు.

ఈ విషయం తెలిసి చాలా బాధపడ్డాడు అడివి శేష్. కెరీర్ లో తనకు తొలి ఎదురుదెబ్బ అదేనంటున్నాడు శేష్. అలా కెరీర్ ప్రారంభంలోనే పెద్ద దెబ్బ తగలడంలో చాలా నేర్చుకున్నానని అన్నాడు. టీనేజ్ లో తగిలిన ఆ దెబ్బ వల్ల చాలా బాధపడ్డానని, ఎన్నోసార్లు ఏడ్చానని, అయితే హార్ట్ బ్రేక్ అయిన సందర్భాన్ని తలచుకొని బాధపడాలి తప్ప, దానికి సంబంధించిన వ్యక్తులపై ద్వేషం పెంచుకోకూడదంటున్నాడు. ఆ తర్వాత ఎన్నో సినిమాల్లో చిన్నచిన్న పాత్రలు పోషించాడు శేష్. అడివి శేష్ చెప్పిన ఈ విషయంపై ఇప్పుడో కొత్త చర్చ మొదలైంది. చందమామ సినిమా నుంచి శేష్, ఇండస్ట్రీలో ఉన్నాడా అంటూ చాలామంది ఆశ్చర్యపోతున్నారు. చందమామ సినిమాకు ముందుగా అనుకున్న టైటిల్ అది కాదంట, ఈ సినిమాకు మల్లెపువ్వు అనే టైటిల్ అనుకున్నారంట.

# "నేను హిందువుగా జన్మించాను... కానీ హిందువుగానే చనిపోను




డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్గారి గురించి సూటిగా, క్లియర్‌గా .....
మొదట ఆయన ఏ మతానికి చెందినవారు అంటే అంబేద్కర్ గారు హిందూ కుటుంబంలో జన్మించారు. ఆయన మహార్ సమాజానికి చెందినవారు, ఆ కాలంలో కుల వివక్ష చాలా తీవ్రముగా ఉండేది.
అయితే ఆయన ఎందుకు మతం మార్చుకున్నారు అనే ప్రశ్నకు సమాధానం ఆయన జీవితానుభవాల్లోనే ఉంది. చిన్నప్పటి నుంచే ఆయనకు కుల వివక్ష ఎదురైంది. స్కూల్లో కూర్చోనివ్వరు, నీళ్లు కూడా తాగనివ్వరు.
పెద్దయ్యాక కూడా పరిస్థితి పెద్దగా మారలేదు. చదువులో ఎంతో ఉన్నత స్థాయికి వెళ్లినా, సమాజంలో గౌరవం మాత్రం దొరకలేదు. ఈ అన్యాయం ఆయనను లోలోపల బాధించింది.
"మనిషిని కులం ఆధారంగా తక్కువగా చూడటం సరైంది కాదు" అనే ఆలోచన ఆయనలో బలంగా పెరిగింది.
ఈ నేపథ్యంలోనే ఆయన ఒక ముఖ్యమైన మాట చెప్పారు. "నేను హిందువుగా జన్మించాను... కానీ హిందువుగానే చనిపోను."
ఈ మాటలో కోపం కంటే ఎక్కువగా బాధ, నిరాశ, మరియు సంకల్పం ఉన్నాయి. ఆయన భావం ఏమిటంటే గౌరవం ఇవ్వని వ్యవస్థలో నేను ఉండను. సమానత్వం ఉన్న జీవితం కావాలి.
ఆ మాట చెప్పిన వెంటనే ఆయన మతం మార్చుకోలేదు. దాదాపు ఇరవై సంవత్సరాలు ఆయన వివిధ మతాలను పరిశీలించారు. చివరకు ఆయనకు సమానత్వం, శాంతి, వివక్ష లేని మార్గంగా కనిపించింది బౌద్ధమతం.
1956 అక్టోబర్ 14న నాగపూర్‌లో ఆయన బౌద్ధ మతం స్వీకరించారు. ఆయనతో పాటు లక్షలాది మంది కూడా మారారు. ఇది ఒక వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదు, ఒక పెద్ద సామాజిక ఉద్యమంగా మారింది.
ఇప్పుడు ముఖ్యమైన ప్రశ్న -ఆయన హిందువుగా చనిపోయారా?
లేదు. అంబేద్కర్ గారు హిందువుగా చనిపోలేదు. ఆయన బౌద్ధ మతాన్ని స్వీకరించిన తరువాత, అదే మతంలో ఉన్నప్పుడే 1956 డిసెంబర్ 6న ఆయన మరణించారు.
మొత్తంగా చూస్తే ఆయన హిందువుగా జన్మించారు, కానీ తన నిర్ణయంతో బౌద్ధ మతాన్ని స్వీకరించి, బౌద్ధుడిగానే జీవితాన్ని ముగించారు.
ఆయన నిర్ణయం ఒక వ్యక్తిగత మార్పు మాత్రమే కాదు, సమానత్వం కోసం చేసిన గొప్ప సామాజిక సందేశం

**- తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా -**
**బాబు జగ్జీవన్ రామ్ నగర్ -**
**హైదరాబాద్ -500037 తెలంగాణ**

# మెగా ఉద్యోగ మేళా కు మంచి స్పందన






**నవతరం- నరసన్నపేట**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాలమేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాకు 13 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 227 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, అందులో 106 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి ముఖ్య అతిధిగా విచ్చేసిన శాసన సభ్యుడు బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, జాబ్ మేళాకు హాజరైన ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగావకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని, గతంలో అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉదోగాలకు నిరీక్షించాల్సివచ్చేదని, ప్రస్తుతం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యం లో కంపెనీలే మనవద్దకు వచ్చి వారికి కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకునే విధంగా పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.పి లత మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి సంస్థ అందిస్తున్న కార్యక్రమాలు, యువతలో ఉండాల్సిన నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరిస్తూ ఈ జాబ్ మేళాకు హాజరైన ప్రతి ఒక్క నిరుద్యోగ యువత ఉద్యోగావకాశాన్ని పొందాలని కోరారు.
అదేవిధంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయి కుమార్ మాట్లాడుతూ, ఏ రంగంలో ఉద్యోగావకాశం వచ్చినా దూరంతో సంబంధం లేకుండా అభ్యర్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరచుకావాలని కోరారు.
ముందు ఉద్యోగంలో చేరి తర్వాత ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు .

# అనధికార రియల్ ఎస్టేట్ లేఔట్ పై జలంత్ర పొత్తంగి వాసి ఫిర్యాదు

**నవతరం- సోంపేట**

స్థానిక సోంపేట మండలం బుషా భద్ర పంచాయతీ జలంత్ర పొత్తంగి గ్రామంలో సర్వేనెంబర్ 444/1,2 లతోపాటు సర్వేనెంబర్ 444/1,2 లలో అనధికారికంగా రియల్ ఎస్టేట్ లేఅవుట్ పై యువజన నేత సాలిన నరసింహ యాదవ్ జిల్లా అధికారులకు గ్రీవెన్స్ లో చేసిన ఫిర్యాదు మేర శుక్రవారం సుడా ఇంజనీరింగ్ అధికారి మోహన్ రావు, స్థానిక పంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావు క్షేత్రస్థాయిలో లేఅవుట్ స్థలాన్ని పరిశీలించారు. ఈ అక్రమ లేఅవుట్ వేసేముందు గ్రామపంచాయతీకి 10 శాతం వివిధ మౌలిక రంగ సౌకర్యాలు కల్పించేందుకు స్థలం విడిచిపెట్టి ఉండవలసినప్పటికీ, అవేమీ పట్టించుకోకుండా అక్రమంగా అక్రమాలు చేసినట్లు సాలిన నరసింహా యాదవ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రధానంగా ఈ లేఅవుట్ వేయడం వల్ల డ్రైనేజ్, మంచినీటి కుళాయిలు వేసేందుకు అవకాశం లేదని, అంతేకాక విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోకుండా, దౌర్జన్యంగా గ్రామకంఠం స్థలాన్ని ఆక్రమించారని ఆయన ఆరోపించారు. చాత్ర స్థాయిలో పరిశీలించిన అధికారులు తమ నివేదికలో అక్రమాలు జరిగినట్లు ధ్రువీకరణ చేస్తారో, లేక ఇతర ఒత్తిడితో కాలయాపన చేస్తారో చూడాలి మరి.

క్షేత్రస్థాయిలో లే అవుట్‌ను పరిశీలించిన సుడా అధికారి.. విలేజ్ సెక్రెటరీ



# జల సంరక్షణ పనుల్లో వేగం పెంచాలి

## డ్వామా డైరెక్టర్ షణ్ముఖరావు




**నవతరం -శ్రీకాకుళం**

జిల్లాలో నీటి భద్రతను కల్పించడంతో పాటు భూగర్భ జలాల మట్టాన్ని గణనీయంగా పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలధార-జలహారతి' పనుల్లో వేగం పెంచాలని డ్వామా డైరెక్టర్ షణ్ముఖరావు అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల పెంపుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన సింగుపురం, ఎస్.ఎం.పురం చెరువుల పనులను ఉదాహరణగా చూపుతూ, పనుల నాణ్యతలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా శివారు భూములకు సైతం సాగునీరు అందేలా కాలువల పునరుద్ధరణ చేపట్టాలని, పనుల పర్యవేక్షణలో ఏపీ-ఫ్రిమ్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో జల వనరుల శాఖ, ఉపాధి హామీ, భూగర్భ జలాల శాఖల అధికారులతో డైరెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల పురోగతిని సమీక్షిస్తూ, గ్రామాల్లో ఉన్న పాత చెరువులు, కుంటల పూడికతీతతో పాటు జంగిల్ క్లియరెన్స్ పనులను వర్షాకాలం ముందే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
నీటి వృథాను అరికట్టేందుకు కాలువలను పటిష్టం చేయాలని, వీబీ రామ్ జీ పథకాన్ని ఈ పనులకు అనుసంధానించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డ్వామా పీడీ లవరాజు, జల వనరుల శాఖ ఈ ఎస్ ఈ సుధాకర్ రావు, భూగర్భ జల శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# 50 ఏళ్ల కల సాకారం

- కొత్తూరు మండలం హంస గ్రామానికి రూ.140.00 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే ఎంజీఆర్
- గ్రామీణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావుగారి హామీ...



**నవతరం- పాతపట్నం**

పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలో కె.వి రోడ్డు నుండి హంస గ్రామం వరకు రూ.140.00 లక్షలు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన బీటీ రోడ్డును గౌరవ శాసనసభ్యులు శ్రీ మామిడి గోవిందరావు గారు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, గత 50 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు నేటితో శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. ఎన్నో దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న హంస గ్రామ ప్రజలకు ఈ బీటీ రోడ్డు ఒక వరంగా మారిందన్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని, ఈ రోడ్డు నిర్మాణం వల్ల హంస గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, పేర్కొన్నారు.
ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ వంటి పథకాల ద్వారా విస్తృతంగా నిధులు కేటాయిస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల ఎన్డీఏ కూటమి నాయకులు,అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు..

# 29న అసంతృప్తి అర్జీదారులతో ముఖాముఖి

## జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి



**నవతరం- పార్వతీపురం**

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అసంతృప్తి అర్జీదారులతో ఈ నెల 29న ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 29వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ క్లినిక్‌లో ముఖాముఖి కార్యక్రమం జరగనుందన్నారు. ఇందులో భాగంగా పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ ముఖాముఖి కార్యక్రమానికి విచ్చేసే అర్జీదారులు గతంలో సమర్పించిన గ్రీవెన్స్ రసీదు, దానిపై తహసీల్దార్, సబ్ కలెక్టర్ జారీచేసిన ఎండార్స్ మెంట్ కాపీని తమతో పాటు తప్పక తీసుకురావాలని కలెక్టర్ కోరారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**